సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



కారు విక్రయం పేరిట మోసం
ఆన్‌లైన్‌లో కారు బుక్ చేసిన ఓ యువకుడు రూ.2.20 లక్షలు మోసపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. - 8లో



జ్వరాలతో విలవిల
విష జ్వరాలతో గుట్ట మున్సిపాలిటీ విలవిలలాడుతోంది. డెంగీ, టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నారు. - 9లో



హైటెక్ హంగులతో బడి
ఇస్కిళ్లలో సుమధుర ఫౌండేషన్ నిర్మించిన అధునాతన పాఠశాల భవనం ప్రారంభానికి సిద్ధమైంది. - 10లో

న్యూస్‌రీల్

పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్

భువనగిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు, భాస్కర్‌రావు, వీరారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీఎఫ్‌ఓ పద్మజారాణి, హార్టికల్చర్ అధికారి అన్నపూర్ణ, జిల్లా ఎస్సీ అభివృద్ధి, వ్యవసా, ఎక్సైజ్, నీటిపారుదల శాఖల అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం, అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, ఆరాధన, శ్రీస్వామి వారికి బాలభోగం, మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించారు. అలాగే ఆలయ మండపంలో శ్రీస్వామివారికి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన గావించి భక్తులకు శ్రీస్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలు నిర్వహించారు. రాత్రి పవళింపు సేవ చేపట్టి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

లింగాకర్షక బుట్టలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

యాదగిరిగుట్ట రూరల్ : ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో బండి శ్రీను వ్యవసాయ పత్తి క్షేత్రంలో బుధవారం లింగాకర్షక బుట్టలు ప్రదర్శించారు. పత్తిలో గులాబీ రంగు, కాయతొలుచు పురుగు, వాటి నియంత్రణకు లింగాకర్షణ బుట్టల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్య రక్షణ చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం జిల్లా శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్‌కుమార్, మధుశేఖర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు స్రావిక, ప్రసన్న, చరిష్మా, బేయర్ కంపెనీ మేనేజర్ లక్ష్మీనారాయణ, రైతులు శ్రీశైలం, సిద్దులు, మల్లయ్య, జహంగీర్, మంజుల పాల్గొన్నారు.

రూ.10.11లక్షలు పలికిన తలనీలాల వేలం


బీబీనగర్ : మండలంలోని పడమటిసోమారం గ్రామంలో గల శ్రీలింగబస్వేశ్వర స్వామి ఆలయంలో తలనీలాలకు సంబంధించి బుధవారం వేలం నిర్వహించగా పాగడ్ల కోటయ్య అనే వ్యక్తి రూ.10,000,11కు దక్కించుకున్నాడు. అలాగే కొబ్బరికాయలు, కిరాణం, టెంట్ దుకాణాలను పత్తి నర్సింహ రూ.3.8లక్షలకు దక్కించుకున్నాడు. రెండు సంవత్సరాల పాటు వేలం అమల్లో ఉంటుందని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుమతి, ఈఓ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ గణేష్‌యాదవ్, ఆలయ మాజీ చైర్మన్లు శ్రీనివాస్‌రావు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ బలోపేతానికి కృషి చేయాలి

భువనగిరిటౌన్ : టీఎన్‌జీఓ బలోపేతానికి నూతన అధ్యక్ష, కార్యదర్శులు కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ కోరారు. బుధవారం జరిగిన టీఎన్‌జీఓ ఈసీ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన భగత్, కార్యదర్శి ఖదీర్‌ను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. సాధారణ ఎన్నికల లోపు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు.

రానుంది నారీ రాజ్యం!

- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాలు
- ఇప్పటికే స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్‌లు
- చట్టసభల్లోనూ పెరగనున్న ప్రాతినిధ్యం



2011 లెక్కల ప్రకారం	
జిల్లా జనాభా 7,39,448	మహిళలు 3,74,719, పురుషులు 3,64,729

సాక్షి, యాదాద్రి : మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడంతో అతివల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నేడు రాజ్యసభలోనూ ప్రవేశపెట్టనుండడంతో బిల్లుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. రిజర్వేషన్ బిల్లు చట్టరూపం దాల్చితే చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరగనుంది. తద్వారా రాజకీయ రంగంలోనూ మరింతగా రాణించడానికి దోహదపడనుంది.

అంతటా అదే చర్చ

కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ సర్కార్.. నారీశక్తి పేరుతో మహిళా బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన నేపథ్యంలో జిల్లాలో అన్ని వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వ్యాపార, వాణిజ్య సముదాయలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ఇలా నలుగురు కూడిన చోట మహిళా బిల్లుపైనే చర్చించుకుంటున్నారు. అయితే లోక్‌సభలో బిల్లుకు ఆమోదం లభించగా రాజ్యసభలో పాస్ కావల్సి ఉంది. ఇక్కడ కూడా బిల్లు ఆమోదం పొందగానే వెంటనే అమల్లోకి తీసుకువస్తే బాగుండేదన్న అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం నామమాత్రంగా ప్రాతినిధ్యం

చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం నామమాత్రంగా ఉంది.1952 నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ, మిర్యాలగూడ, భువనగిరి లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఒక్క మహిళ కూడా ప్రాతినిధ్యం వహించలేదు. 1952 నుంచి 2014 వరకు నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గానికి 19 సార్లు ఎన్నికలు జరిగాయి. కానీ, మహిళలకు పోటీ చేసే అవకాశం దక్కలేదు. అలాగే మిర్యాలగూడ పార్లమెంట్ స్థానానికి 12సార్లు ఎన్నికలు జరగగా 1996లో మాత్రం సీపీఎం నేత మల్లు స్వరాజ్యం బరిలోకి దిగి బద్దం నర్సింహారెడ్డి(కాంగ్రెస్) చేతిలో ఓడిపోయారు. భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి రెండుసార్లు పురుషులే గెలుపొందారు.

ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆలేరు	1,28,206	1,22,241	44	2,50,491
భువనగిరి	1,03,741	1,03,092	00	2,06,833
మునుగోడు	1,21,524	1,16,656	05	2,38,155
తుంగతుర్తి	1,21,058	1,19,039	07	2,40,104

స్థానిక సంస్థల్లో రాణిస్తున్న మహిళలు

స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు వచ్చిన తర్వాత మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. తమకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారు. కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులుగా రాణిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో మహిళలకు199 స్థానాలు మహిళలకు రిజర్వ్ అయ్యాయి. వీటిలో ఎస్టీ 23, ఎస్సీ 31, బీసీ 54, జనరల్ 91 స్థానాలు మహిళలకు కేటాయించబడ్డాయి. వీటితో పాటు జనరల్ స్థానాల్లోనూ మహిళలు పోటీ చేసి విజయం సాధిస్తున్నారు. మొత్తంగా జిల్లాలో 421 గ్రామ పంచాయతీలకు గాను 208 స్థానాల్లో మహిళలు గెలుపొంది పాలనలో తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకుంటున్నారు. లోక్‌సభ, శాసనసభలోనూ ప్రాతినిధ్యం పెరిగితే రాజకీయ రంగంలోనూ రాణించే అవకాశం ఉంటుంది.

ఒక్కరే మహిళా ఎమ్మెల్యే

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడంతో రాజకీయ నాయకుల్లో ఆందోళన మొదలైంది. తమ సీట్లకు ఎక్కడ ఎసరు వస్తుందోనన్న గుబులు నెలకొంది. జిల్లా పరిధిలో ఐదు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానం ఉంది. ఇందులో ఆలేరు నుంచి మాత్రమే మహిళ ఎమ్మెల్యేగా ఉన్నారు. కాగా మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందితే నియోజకవర్గాల్లో కొన్ని స్థానాలు మహిళలకు దక్కే అవకాశం లేదని సోషల్ మీడియాలో జరుగుతన్న ప్రచారం చర్చనీయాంశంగా మారింది. ఒక వేళ రాజ్యసభలోనూ బిల్లు ఆమోదం పొందినా ఈ ఎన్నికల్లో అమల్లోకి రాదని తేలడంతో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఊపిరి పీల్చుకున్నారు.

మోదీకి చిత్త శుద్ధిలేదు



మహిళా బిల్లుపై ప్రధాని మోదీకి చిత్తశుద్ధి లేదు. మహిళా ఓటర్లను ప్రలోభ పెట్టడానికే బిల్లు ప్రవేశపెట్టారు. 2010లోనే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసింది. కానీ లోక్‌సభలో ఆమోదం పొందలేదు. బిల్లు ఆమోదం పొందిన వెంటనే చట్టబద్ధ కల్పించాలి

–నీలం పద్మ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు

బిల్లు ఆమోదం పొందుతుంది



మహిళా బిల్లు ఆమోదం పొందుతుంది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుకోసం మహిళలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. బిల్లు తెచ్చిన ప్రధానికి మహిళల తరపున కృతజ్ఞతలు.

–జనగాం కవిత, 13వ వార్డు కౌన్సిలర్, భువనగిరి

ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించాలి



ఇప్పటి వరకు చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు లేకపోవడం వల్ల అన్యాయం జరుగుతుంది. ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ ఇవ్వాలి. వచ్చే ఎన్నికల నుంచే అమలు చేయాలి.

–తంగళ్లపల్లి శ్రీవాణి, 35 వార్డు కౌన్సిలర్, భువనగిరి

కేంద్ర నిర్ణయం హర్షణీయం



లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడం హర్షణీయం. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఎమ్మెల్సీ కవిత చేసిన పోరాటం ఫలించింది. మహిళల తరపున ధన్యవాదాలు.

– తోటకూర అనురాధ, జెడ్పీటీసీ, యాదగిరిగుట్ట

ఓట్ల కోసం తెచ్చినట్టుంది



మహిళా బిల్లును స్వాగతిస్తున్నాం. కానీ, ఓబీసీలకు రిజర్వేషన్ లేకుండా బిల్లును అనుమతించం. మహిళల ఓట్ల కోసం బిల్లు తెచ్చినట్లు కన్పిస్తోంది. బీసీలకు ఇవ్వని బిల్లుతో ప్రయోజనం ఉండదు.

– సిద్దుల పద్మ, బీఆర్‌ఎస్ నాయకురాలు, భువనగిరి

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 80962 93702

జీఓలేనా.. బిల్లులు విడుదల చేయరా?



భువనగిరిలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

- మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

భువనగిరి : మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వంట ఏజెన్సీ కార్మికులు బుధవారం భువనగిరిలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వారికి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం కేవలం జీఓలు మాత్రమే విడుదల చేస్తుందని, బిల్లులు మాత్రం ఇవ్వడం లేదన్నారు. బిల్లులు చెల్లించకపోగా అక్టోబర్ నుంచి విద్యార్థులకు అల్పాహారం, రాగి జావ అందజేయాలనడం సరికాదన్నారు. వంట కార్మికులకు పెంచిన వేతనాలతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యులు సామల భాస్కర్, మధ్యాహ్న భోజన వంట కార్మికుల జిల్లా అధ్యక్షురాలు బాగుల వసంత, ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, ఉపాధ్యక్షుడు జిన్న కృష్ణ, మణెమ్మ, నిర్మల, సంధ్య, లక్ష్మి, మమత, స్వప్న పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేయించండి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆలేరురూరల్ : 2023 అక్టోబర్ 1నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి కోరారు. బుధవారం ఆయన ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించి ఫారమ్ 6,7,8లపై సమీక్షించారు. ఏవైనా అభ్యంతరాలు తెలియజేయాలని వారికి సూచించారు. మరణించిన వారు ఉంటే వారి కుటుంబ సభ్యుల నుంచి ధ్రువీకరణ పొంది జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిపారు. డబుల్ ఓట్లు సంబంధిత ఓటరు వద్దకు వెళ్లి అతని నుంచి దరఖాస్తు తీసుకొని తొలగిస్తామన్నారు. సంచార వాహనాల ద్వారా ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై అవగాహన కల్పిస్తున్నామని, అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పుట్ట మల్లేషం, చెక్క వెంకటేష్, శ్రీశైలం, పాల్గొన్నారు.

వయోవృద్ధుల హక్కుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన దివ్యాంగులు, వయోవృద్ధుల కమిటీ కన్వర్జెన్సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్ సిటిజెన్ సంరక్షణ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. వయోవృద్ధుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1456 అందుబాటులో వుందన్నారు. సమావేశంలో పలువురు.. వయో వృద్ధుల సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ అధికారి అన్నపూర్ణ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

- జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బీకూనాయక్

భువనగిరి టౌన్ : రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని వ్యవసాయ స్థాయీ సంఘం అధ్యక్షుడు, జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్ అన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన వ్యవసాయ స్థాయీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ రైతుబీమా వర్తింపజేయాలని, కస్టర్ల వారీగా సదస్సులు ఏర్పాటు సాగులో మెళకువలపై అవగాహన కల్పించాలని కోరారు. బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాల పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న క్రషర్లను నియంత్రించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ అధికారి అనురాధ మాట్లాడుతూ వానాకాలం జిల్లా వ్యాప్తంగా 4,12,925 ఎకరాల్లో పంటలు సాగయ్యాయని, ఇందులో 3,30,351 ఎకరాల్లో వరి వేశారని పేర్కొన్నారు. ఎరువుల డిమాండ్ 58,988 మెట్రిక్ టన్నులు కాగా ప్రస్తుతం 60 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 2,68,881 మంది రైతులు ఉండగా రైతుబీమాకు 1,48,153 మంది రైతులకు అర్హత ఉందన్నారు. డిసెంబర్ వరకు కుటుంబంలోని ఒకరికి నెలకు ఆరు కిలోల బియ్యం ఉచితంగా ఇవ్వనున్నట్లు డీసీఏ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మార్కెటింగ్ వ్యవస్థపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ అధికారి సబిత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 701 చెరువుల్లో సుమారు 3 కోట్ల చేప పిల్లలు వదిలినట్లు మత్స్య శాఖ జిల్లా అధికారి రాజారాం వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, వివిధ శాఖల అధికారులు వెంకటరాయణ జ్యోతికుమార్, శ్రీనివాసరావు, పద్మజారాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు తోడ్పాటునందించాలి

భువనగిరి టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణకు గ్రామస్థాయి అధికారులు తోడ్పాటు అందించాలని మహిళా శిశుసంక్షేమ స్థాయీ సంఘం అధ్యక్షురాలు గోలి ప్రణీత కోరారు. స్థాయీ సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో పాల్గొంటున్నందున కేంద్రాలు నిర్వాహణ, పర్యవేక్షణ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లు చూడాలన్నారు.

వసతి గృహాల్లో రాత్రి బస తప్పనిసరి

ప్రభుత్వ వసతి గృహాల్లో అధికారులు రాత్రి బస చేయాలని సాంఘిక సంక్షేమం స్థాయీ సంఘం అధ్యక్షురాలు తోటకూరి అనురాధ సూచించారు. హాస్టళ్లలో ఖాళీ సీట్లు భర్తీ

వడివడిగా వాసాలమర్రి పునర్నిర్మాణం

- స్లాబ్ దశలో ప్రభుత్వ కార్యాలయాలు
- త్వరలో ఇళ్ల పనులు ప్రారంభం
- ప్రణాళిక రూపొందించిన అధికారులు



స్లాబ్ దశలో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు

తుర్కపల్లి : సీఎం కేసీఆర్ దత్తత గ్రామమైన వాసాలమర్రి పునర్నిర్మాణ పనులు వడివడిగా సాగుతున్నాయి. తొలుత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్‌సెంటర్, గ్రామ పంచాయతీ భవనానికి ప్రభుత్వం నిధులు కేటాయించడంతో వాటి నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ఇళ్లు, ఇతర నిర్మాణాలకు సైతం అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

కేటాయించిన నిధులు ఇలా..

- ప్రాథమిక పాఠశాలతో పాటుగా జిల్లా పరిషత్ హైస్కూల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.23 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో చేపట్టిన పనులు ప్రస్తుతం స్లాబ్ దశలో ఉన్నాయి.
- హెల్త్ సబ్ సెంటర్‌కు రూ.25 లక్షలు కేటాయించారు. పనులు ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యింది.
- వాసాలమర్రిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, దాని మదిర గ్రామం రాంశెట్టిపల్లిలో ఒక అంగన్‌వాడీ కేంద్రం నిర్మిస్తున్నారు. ఈ మూడు భవనాలకు సుమారు రూ.75 లక్షల విడుదలయ్యాయి. ఒక్కో భవనాన్ని రూ.25లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పనులు స్లాబ్ దశలో ఉన్నాయి.
- ఉపాధిహామీ నిధులు రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం పనులను ప్రారంభించారు. కాగా భవనం ఆధునిక హంగులతో ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి సొంత నిధులు మరో రూ.10లక్షలు కేటాయించారు. పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ .. వాసాలమర్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఇటీవల పనులను పరిశీలించారు. భవన నిర్మాణాలపై అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.

ఇళ్ల పనులను ప్రారంభిస్తాం



వాసాలమర్రిని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామ పంచాయతీ భవనం పనులు యుద్ధప్రాతిపదికన నడుస్తున్నాయి. ఇళ్ల నిర్మాణ పనులను కూడా త్వరలోనే ప్రారంభించనున్నాం. నాలుగు విభాగాల్లో ఉన్న వారందరికీ అన్ని సౌకర్యాలతో నూతన ఇళ్లు నిర్మిస్తాం.

–గొంగిడి సునీత, ప్రభుత్వ విప్

పనులు వేగంగా జరుగుతున్నాయి



గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్‌సెంటర్, గ్రామ పంచాయతీ భవనం పనులను తొలుత ప్రారంభించాం. ఇవే కాకుండా ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశాం. గ్రామ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అందిస్తున్న సహకారం మరవలేనిది.

–పలుగుల నవీన్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు, వాసాలమర్రి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

ప్రభుత్వం దిగొచ్చే దాకా సమ్మె

- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

భువనగిరిటౌన్ : డిమాండ్ల సాధనకోసం పది రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదని, ప్రభుత్వం దిగొచ్చే దాకా ఆందోళన కొనసాగుతుందని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు స్పష్టం చేశారు. సమ్మెలో భాగంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూరుగు స్వప్న, రామకుమారి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పిన బీఆర్‌ఎస్.. నేటికీ అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గొరిగే సోములు జిల్లా కమిటీ సభ్యులు కొల్లూరి ఆంజనేయులు, మంచాల మధు, బొడ్డుపల్లి వెంకటేశం పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీహెచ్‌సీలో షార్ట్‌సర్క్యూట్

- రెండు ఫ్రిజ్‌లు దగ్ధం


దగ్ధమైన ఫ్రిజ్‌లు, మందులు

బీబీనగర్‌: బీబీనగర్‌లోని రైల్వేస్టేషన్‌ ఎదురుగా గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం షార్ట్‌సర్క్యూట్‌ జరిగి రెండు ఫ్రిజ్‌లతో పాటు వైద్య పరికరాలు, మెడిసిన్‌ దగ్ధమయ్యాయి. షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా భవనంలో పూర్తిగా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. దీంతో భవనంలోని సిబ్బంది బయటకు పరుగెత్తారు. పైఅంతస్తులో ఉన్న డెలివరీ గదిలోకి సైతం పొగలు వ్యాపించాయి. ఆ సమయంలో రోగులు ఎవరూ ఆస్పత్రిలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం సిబ్బంది విద్యుత్‌ సరఫరాను నిలిపివేసి మంటలను ఆర్పారు. రోగులకు వైద్యసేవల్లో ఎలాంటి ఆటంకాలు జరగకుండా వైద్యాధికారి యాదగిరి చర్యలు తీసుకున్నారు. విషయం తెలుసుకున్న డీహెంఎచ్‌ఓ మల్లికార్జున్‌రావు, ఎంపీపీ సుధాకర్‌గౌడ్‌, జెడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి, ఏంపీడీఓ శ్రీవాణి పీహెచ్‌సీని పరిశీలించారు.

కల్తీ పాలు సీజ్‌.. ఇద్దరు వ్యాపారులపై కేసు

భూదాన్‌పోచంపల్లి : ఎస్‌ఓటీ పోలీసులు కల్తీపాలను పట్టుకొని ఇద్దరు పాల వ్యాపారులపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కల్తీ పాలను తయారు చేసి వినియోగదారులకు విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం ఉదయం ఎస్‌ఓటీ పోలీసులు భూదాన్‌ పోచంపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామానికి చెందిన పాల వ్యాపారి కప్పల రవి, కనుముకుల గ్రామానికి చెందిన కుంభం రఘు ఇంటిపై దాడి చేశారు. వారిద్దరి నుంచి 450 లీటర్ల కల్తీ పాలు, 300 మిల్లీ లీటర్ల హైడ్రోజన్‌ పెరాక్సైడ్‌, 4 స్కిమ్డ్‌ మిల్క్‌ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొన్నారు. అనంతరం కల్తీపాలను లేబోరేటరీస్‌కు పంపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని రెండు ఎద్దులు మృతి


ఘటనాస్థలంలో ఎద్దుల కళేబరాలు

పెద్దవూర: కారు ఢీకొని రెండు ఎద్దులు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి పెద్దవూర మండలంలోని కుంకుడుచెట్టుతండా వద్ద చోటు చేసుకుంది. కుంకుడుచెట్టుతండాకు చెందిన రమావత్‌ భోజ్యా పొద్దంతా తన పత్తి చేనులో ఎద్దులతో అరక కట్టాడు. అనంతరం రాత్రి వరకు ఎద్దులను మేపాడు. తిరిగి తన ఎద్దులను తోలుకుని నాగార్జునసాగర్‌–హాలియా ప్రధాన రహదారి వెంట నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో హాలియా వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు రోడ్డు పక్కన వస్తున్న ఎద్దులను ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో రెండు ఎద్దులకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. ఎద్దుల వెనుక వస్తున్న యజమాని భోజ్యా పక్కకు దూకడంతో ప్రాణాప్రాయం తప్పింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జ య్యింది. కారులో ఉన్న వ్యక్తులకు గాయాలయ్యాయి. మృతిచెందిన ఎద్దుల విలువ రూ.1.2 లక్షలు ఉంటుందని బాధిత రైతు పేర్కొంటున్నాడు.

60 ఏళ్లుగా నిర్విరామంగా..

దేవరకొండ: పట్టణంలోని పెద్ద రామాలయం(పాతరామాలయం)లో 1963 నుంచి ప్రతి సంవత్సరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అప్పట్లో పగిడిమర్రి రామన్న ఆధ్వర్యంలో మొట్టమొదటగా వినాయక ఉత్సవాలు ప్రారంభం కాగా నాటి నుంచి నేటి వరకు ఉత్సవ కమిటీ సభ్యులు అదే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. గతంలో శోభాయాత్ర ముగిసిన తర్వాత భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసేవారు. కాగా గత పదేళ్ల నుంచి తొమ్మిది రోజుల పాటు భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానం చేస్తున్నారు. అంతేకాకుండా గతంలో 15ఏళ్ల పాటు వరుసగా హరికథా కాలక్షేపం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


దేవరకొండలోని పెద్ద రామాలయంలో కొలువైన గణనాథుడి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నాం



పెద్ద రామాలయంలో ప్రతి ఏడాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నాం. గత 60ఏళ్లుగా దేవాలయ ప్రాంగణంలో గణనాథుడు కొలువుదీరుతున్నాడు.

– నక్క వెంకటేష్‌యాదవ్‌, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

తొమ్మిది రోజులు అన్నదానం



పెద్ద రామాలయంలో కొలువుదీరే గణపయ్య వద్ద ప్రతిరోజు ప్రత్యేక పూజలు కొనసాగుతాయి. గతంలో నిమజ్జనం తర్వాత భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసేవాళ్లం. గత పదేళ్ల నుంచి తొమ్మిది రోజుల పాటు భక్తులకు అన్నదానం చేస్తున్నాం.

– పగిడిమర్రి రఘురాములు,దేవాలయ ధర్మకర్త

భక్తుల కొంగుబంగారం.. మార్కెట్‌ గణపతి

- 48ఏళ్లుగా మిర్యాలగూడలో నిర్విఘ్నంగా నవరాత్రి ఉత్సవాలు
- ప్రతియేటా వైభవంగా లంబోదరుడి బ్రహ్మోత్సవాలు

మిర్యాలగూడ టౌన్‌ : మిర్యాలగూడ పట్టణంలోని గణేష్‌ మార్కెట్‌ విఘ్నేశ్వరుడు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. పట్టణంలోని గణేష్‌ మార్కెట్‌లోని చిరు వ్యాపారులందరూ 1975 నుంచి 48 ఏళ్లుగా దివంగత అల్వాల లక్ష్మీనర్సయ్య–మస్తానమ్మ దంపతుల ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 18 ఏళ్ల క్రితం పట్టణ ప్రజలు, వ్యాపారస్తులందరి సహకారంతో గణేష్‌ మార్కెట్‌ విఘ్నేశ్వరుడి పేరుతో ఆలయాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. తొలుత మట్టి విగ్రహంతో 15ఏళ్ల పాటు ఉత్సవాలు నిర్వహించగా కాలానుగుణంగా రెండు ఫీట్ల విగ్రహం నుంచి నేడు రసాయనాలతో తయారు చేసిన 20 ఫీట్ల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నిర్ణయం మేరకు తొమ్మిదేళ్లగా బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా నిర్వహిస్తుంటారు. అప్పటి స్వామివారి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలతో పాటు వినాయక చతుర్థ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు.


మిర్యాలగూడ గణేష్‌ మార్కెట్‌లో విఘ్నేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు రవిశర్మ

గణనాథుడి కల్యాణం

ఈ ఆలయంలో సిద్ధి, బుద్ధి సమేతంగా వినాయక కల్యాణ మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహిస్తుంటారు. ప్రతి సంవత్సరం నిర్వహించే గణేష్‌ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలోని విఘ్నేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించడం విశేషం. శ్రీకాళహస్తి నుంచి ప్రధాన అర్చకులు బ్రహ్మణ శ్రీశ్రీ రాజేష్‌ గురుకుల్‌ వచ్చి స్వామివారి కల్యాణాన్ని నిర్వహించడం మరో విశేషం. ఈ ఉత్సవాల చివరి రోజున నిర్వహించే చందనాలంకరణ చాల విశిష్టమైనది.

18 ఏళ్లుగా స్వామివారికి నిత్యాభిషేకం



18 ఏళ్లుగా గణేష్‌ మార్కెట్‌ విఘ్నేశ్వర ఆలయంలో ప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్నాను. నాటి నుంచి నేటి వరకు స్వామివారికి నిత్యాభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నాం. 48 ఏళ్లుగా స్వామవారికి గణేష్‌ మార్కెట్‌ గల్లీలో ప్రత్యేకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ.

– దాములూరి రవిశర్మ, ప్రధాన అర్చకుడు, మిర్యాలగూడ

కారు విక్రయం పేరిట మోసం

- ఆన్‌లైన్‌లో యువకుడి వద్ద రూ.2.20లక్షలు కాజేసిన దుండగుడు
- సైబర్‌ క్రైం పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

తుర్కపల్లి: ఆన్‌లైన్‌లో కారు విక్రయం పేరిట ఓ యువకుడిని దుండగుడు మోసగించి రూ.2.20లక్షలు కాజేశాడు. తుర్కపల్లి మండలంలో బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తుర్కపల్లి మండలం దయ్యంబండ తండాకు చెందిన వాంకుడోత్‌ మహేశ్‌ మిత్రుడు ఆన్‌లైన్‌లో షిఫ్ట్‌ డిజైర్‌ కారు చూసానని చాల తక్కువ రేటు ఉందని, ఆ వెబ్‌సైట్‌ ఫోన్‌ నంబర్‌ ఇచ్చాడు. దీంతో మహేశ్‌ ఇంటికి వెళ్లి ఆ నంబర్‌కు ఫోన్‌ ఫోన్‌చేయగా అవతలవైపులో వ్యక్తి తన పేరు రాము అగర్వాల్‌గా పరిచయం చేసుకున్నాడు. తను మహారాష్ట్రాలోని పూణేలో మిలిటరీలో పనిచేస్తున్నానని, బదిలీ కారణంగా, తన షిఫ్ట్‌ డిజైర్‌ కారు అత్యవసరంగా విక్రయిస్తున్నానని చెప్పాడు. ముందుగా రూ.3,500 చెల్లిస్తే కారును పంపిస్తానని నమ్మబలికాడు. దీంతో మహేశ్‌ అతడికి ఆ డబ్బు ఆన్‌లైన్‌ పేమెంట్‌ చేసాడు. అరగంట తరువాత తిరిగి ట్రాన్స్‌పోర్టుకు 11,099 రూపాయలు చెల్లించాలని, అవి నాకు ఇచ్చే డబ్బుల్లో తక్కువ చేసి ఇవ్వాలని సూచించాడు. కారు రోడ్డు మార్గం తీసుకొస్తున్నానని దుండగుడు నమ్మబలికాడు. అలా మహేశ్‌ అతడి సూచనల ప్రకారం రూ.2.20లక్షలు వంతుల వారీగా పంపించాడు. కారు తీసుకొస్తున్నారా అని మహేశ్‌ పలుమార్లు ఫోన్‌ చేయగా తను సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌ వరకు వచ్చానని నమ్మబలికాడు. సాయంత్రం వరకు చూసిన మహేశ్‌ మళ్లీ ఫోన్‌ చేయగా తనకు అత్యవసరంగా ఆఫీస్‌ నుంచి కాల్‌ వచ్చిందని, తిరిగి వెళ్లిపోయానని, మీకు కారు పంపిస్తానని చెప్పాడు. మోసపోయానని గ్రహించిన బాధితుడు స్థానిక పోలీసులతో పాటు సైబర్‌ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుండగుడు ఆన్‌లైన్‌లో మహేశ్‌కు చూపిన కారు నంబర్‌తో ఆన్‌లైన్‌లో ఆర్‌సీ చెక్‌ చేయగా కరీంనగర్‌కు చెందిన వ్యక్తిదిగా తెలిసింది. ఆ కారుకు రిజిస్ట్రేషన్‌ పేపర్లు లేక పోవడంతో అమ్ముకున్నట్లు తెలిసింది.


మహేశ్‌కు ఆన్‌లైన్‌లో చూపించిన కారు

టెట్‌లో అర్హత సాధించలేనని..

- మనస్తాపంతో గడ్డిమందు తాగిన గృహిణి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

నార్కట్‌పల్లి : టెట్‌లో అర్హత సాధించలేనని మనస్తాపంతో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గృహిణి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. నార్కట్‌పల్లి మండలం బాజకుంట గ్రామానికి చెందిన చిల్లర ఉమ (24) ఈ నెల 15న నిర్వహించిన టెట్‌ పరీక్ష సరిగా రాయలేదు. దీంతో పరీక్షలో అర్హత సాధించలేనని మనస్తాపం చెందింది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 18న ఇంట్లోనే గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను నల్లగొండలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మృతురాలి తండ్రి పల్లగొర్ల ఆదినారాయణ పరీక్షలో అర్హత సాధించలేననే మనస్తాపంతోనే తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదబాబు తెలిపారు.

కోతుల బెడదతో చేనుకు విద్యుత్‌ కంచె..

- గమనించక.. గడ్డి కోసేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో మహిళ మృతి


నాగారం : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. ఈ ఘటన నాగారం మండలం డి.కొత్తపల్లిలో చోటు చేసుకుంది. డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇరుగు యశోద (50) పాడిగేదెకు పచ్చిగడ్డిని కోసుకొచ్చేందుకు మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని పొలాల వైపు వెళ్లింది. ఈ క్రమంలో మామిడాల సత్యనారాయణ పొలాన్ని కౌలు చేస్తున్న లింగయ్య పొలంలోకి గడ్డికోసేందుకు వెళ్లింది. కౌలు రైతు లింగయ్య తన పొలాన్ని కోతులు నాశనం చేస్తున్నాయనే ఉద్దేశంతో రక్షణకు పొలానికి ముందు భాగంలో బైండింగ్‌ వైర్‌ కట్టి దానికి సర్వీస్‌వైర్‌తో విద్యుత్‌ కనెక్షన్‌ ఇచ్చాడు. యశోద విద్యుత్‌ వైరును గమనించక పొలంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో కాళ్లకు తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. యశోద చికటి పడినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టపక్కల గాలించి చివరకు పొలాల వద్ద వెతకగా మృతదేహం లభ్యమైంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్‌ సరఫరాను నిలిపివేసి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలికి ముగ్గురు చొప్పున కూమార్తెలు, కుమారులు ఉన్నారు. రైతు గ్రామంలో సమాచారం ఇవ్వకుండా పొలానికి విద్యుత్‌ కంచే ఏర్పాటు చేయడంతోనే యశోద మృతిచెందిందని, తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతురాలి కుటుంబ సభ్యులు గ్రామస్తులతో కలిసి బుధవారం సూర్యాపేట– జనగాం జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. పోలీసులు కుటుంబ సభ్యులకు నచ్చచెప్పడంతో ధర్నా విరమించారు. మృతురాలి కుమారుడు ఇరుగు ఉపేందర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.ముత్తయ్య తెలిపారు.


పొలంలో యశోద మృతదేహం

శునకాన్ని తప్పించబోయి..

- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన బైక్‌
- యువకుడి మృతి

మిర్యాలగూడ టౌన్‌ : శునకాన్ని తప్పించబోయి బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. మిర్యాలగూడ మండలం కొత్తగూడేనికి చెందిన ఆలేటి చంద్రకాంత్‌ అలియాస్‌ చరణ్‌(23) గరిడేపల్లిలో తన సోదరుడు శివ వద్ద ఉంటూ అదే మండలం గడ్డిపల్లిలోని రైస్‌ మిల్లులో పనిచేస్తున్నాడు. చరణ్‌ పనినిమిత్తం బుధవారం బైక్‌పై మిర్యాలగూడకు వెళ్లి స్వగ్రామమైన కొత్తగూడెంలో ఉన్న మేనమామ సోమయ్యను కలిసి తిరిగి గరిడేపల్లికి బయలుదేరాడు. మార్గమధ్యలో అవంతిపురం వ్యవసాయ మార్కెట్‌ వద్ద అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చిన శునకాన్ని తప్పించబోయే క్రమంలో బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో చరణ్‌ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వాసవీ క్లబ్‌, లయన్స్‌ క్లబ్‌ రిజినల్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌, విజయ్‌భాస్కర్‌ ప్రోత్సాహంతో చరణ్‌ నేత్రాలను కుటుంబ సభ్యులు ఖమ్మం నేత్రనిధికి అందజేశారు. మృతుడి సోదరుడు శివ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.


చరణ్‌(ఫైల్‌)

మహిళా బిల్లును వెంటనే అమలు చేయాలి

కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా బిల్లుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అయితే బిల్లును వెంటనే అమలు చేస్తే బాగుంటుందని అన్ని వర్గాల మహిళలు అభిప్రాయ పడుతున్నారు. బీజేపీ ఈ బిల్లును ఎన్నికల జిమ్మిక్కుగా వాడుకోకుండా.. అమలు చేయాలని కోరుతున్నారు. మరోవైపు బిల్లులో ఓబీసీ రిజర్వేషన్‌ కూడా ఉంటే బాగుంటుందని పేర్కొంటున్నారు.

2024 ఎన్నికల్లోనే అమలు చేయాలి



సమాజంలో సగభాగం ఉన్న మహిళలకు స్వాతంత్రం వచ్చిన 75 ఏళ్ల తర్వాత రాజకీయ రిజర్వేషన్‌ వస్తోంది. బీజేపీ తమ రాజకీయ అవకాశవాదం చూసుకునే ఈ బిల్లు తెచ్చింది. అనేక ఉద్యమాలు చేసిన తర్వాత ఈ బిల్లును తేవడం అభినందనీయం. మహిళా బిల్లును జాప్యం చేయకుండా 2024 ఎన్నికల్లోనే అమలు చేయాలి.

– పాలడుగు ప్రభావతి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి, నల్లగొండ

ముమ్మాటికీ ఎన్నికల జిమ్మిక్కే



మహిళా బిల్లును ఎన్నికల జిమ్మిక్కుగా కనిపిస్తోంది. ఓ వైపు బిల్లు తెస్తున్నామని అంటూనే డీలిమిటేషన్‌ తర్వాతే అమలు అవుతుందని చెప్పడంతోనే బీజేపీ ప్రభుత్వ ఎత్తుగడలు అర్థమవుతున్నాయి. మహిళా బిల్లు పేరుతో హడావుడి చేస్తూ తమ తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకు, ప్రజల దృష్టిని మరల్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

– పోలెబోయిన వరలక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు, నల్లగొండ

అమలులోకి వస్తేనే న్యాయం



మహిళా బిల్లు అమలులోకి వస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌లు కావాలని గీతాముఖర్జీ 25 ఏళ్లు పోరాడారు. ఇప్పటికైనా బిల్లు ఆమోదం పొందడం హర్షణీయం. బిల్లు అమలులోకి వస్తేనే దాని ఫలాలు, ఫలితాలను మహిళలు పొందే వీలు కలుగుతుంది. వెంటనే అమలులోకి వచ్చే విధంగా చూడాలి.

– దేవరం మల్లీశ్వరి, జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట

ఎన్నికల స్టంట్‌



మహిళా రిజర్వేషన్‌ బిల్లు ఎన్నికల స్టంట్‌లా ఉంది. 2014లోనే పాస్‌ అవ్వాల్సిన బిల్లును ఇన్ని రోజులు పెండింగ్‌లో ఉంచి ఎన్నికల ముందు పాస్‌ చేశారు. దీనికి తోడు 2027 నుంచి అమలులోకి వస్తుందని ప్రకటించారు. వెంటనే అమలు చేస్తే ప్రధాని మోదీ చరిత్ర పుటల్లో నిలిచేవారు.

– మల్లు లక్ష్మి, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మహిళా బిల్లు చారిత్రాత్మకం



కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్‌ బిల్లు తీసుకు రావడం చారిత్రాత్మక నిర్ణయం. కొత్త పార్లమెంటు భవనంలో మొదట మహిళా బిల్లు పెట్టడం చరిత్రలో నిలిచిపోనుంది. ఏ ప్రభుత్వం చేయని ధైర్యాన్ని మోదీ ప్రదర్శించారు. ఈ బిల్లు అమలైతే ఎంతో మంది మహిళలు చట్టసభల్లో అడుగు పెడతారు.

– కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు

ఓబీసీ రిజర్వేషన్‌ చేర్చాలి



పార్లమెంట్‌లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్‌ బిల్లు అసంపూర్ణంగా ఉంది. మహిళా రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం జరుగుతుంది. బిల్లులో ఓబీసీ రిజర్వేషన్‌ చేర్చాలి. అప్పుడే చట్టసభల్లో బీసీలకు న్యాయం జరుగుంది.

– అనంతుల మల్లీశ్వరి, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు

మహిళల ఓట్ల కోసం డ్రామా



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళల ఓట్ల కోసం డ్రామా ఆడుతోంది. మహిళా బిల్లును 2024 ఎన్నికల నుంచే అమలు చేయాలి. ఈ బిల్లులో బీసీల వాటా తేల్చలేదు. మహిళా బిల్లును గతంలో కాంగ్రెస్‌ ప్రభుత్వమే ప్రవేశ పెట్టింది. చాలా పార్టీలు సహకరించలేదు. ఎట్టకేలకు మహిళా బిల్లును లోక్‌సభ ఆమోదించడం హర్షించదగ్గ విషయం.

– గోపగాని మాధవి, మహిళా కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షురాలు, నల్లగొండ

50 శాతం అమలు చేస్తే బాగుండు



చట్టసభల్లో మహిళా రిజర్వేషన్‌ బిల్లు అమలు హర్షించదగిన విషయమే. అయితే మహిళలు పురుషులతో సమానం, అన్నింటా సగం అన్నట్లుగా 50 శాతం రిజర్వేషన్‌ కల్పిస్తే బాగుండేది. అదే విధంగా మహిళా రిజర్వేషన్‌లో ఓబీసీ రిజర్వేషన్‌ అవసరం.

– కొత్తపల్లి రేణుక, పీఓడబ్ల్యూ జిల్లా కన్వీనర్‌

ట్రాక్టర్‌ కిందపడి యువకుడి మృతి


రాకేష్‌(ఫైల్‌)

కనగల్‌ : ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌ కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. కనగల్‌ మండల పరిధిలోని శేరి లింగోటం స్టేజి వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కనగల్‌ మండల పరిధిలోని అమ్మగూడెం గ్రామపంచాయతీ బొమ్మేపల్లి గ్రామానికి చెందిన తాటికొండ రాకేష్‌(34) సాండ్‌ ట్యాక్స్‌ విధానం ద్వారా ఇసుకను నల్లగొండలో అన్‌లోడ్‌ చేసి తిరిగి గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో శేరి లింగోటం స్టేజి వద్దకు రాగానే ట్రాక్టర్‌తో డివైడర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో రాకేష్‌ ట్రాక్టర్‌ ఇంజన్‌ టైరు కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎమ్మెల్యే కంచర్ల పరామర్శ

రాకేష్‌ మృతికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలో రాకేష్‌ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పీఏసీఎస్‌ చైర్మన్‌ సహదేవరెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు యాదయ్యగౌడ్‌, సర్పంచ్‌ సింగం కోటేష్‌, ఉపసర్పంచ్‌ లక్ష్మమ్మలింగయ్య ఉన్నారు.

ఒక ప్రమాదం.. మూడు కుటుంబాల్లో విషాదం

- తల్లి,తండ్రితో పాటు సోదరుడి మృతితో ఒంటరైన బాలుడు
- కుటుంబాలకు ఆసరా అవుతారనుకుంటే విగతజీవులైన ఇద్దరు యువకులు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు
- అతివేగం, మూలమలుపే ప్రమాదానికి కారణమంటున్న పోలీసులు



చింతపల్లి మండలం నసర్లపల్లి వద్ద ప్రమాదంలో బోల్తా పడిన కారు, నుజ్జునుజ్జయిన బైక్‌

చింతపల్లి, పెద్దఅడిశర్లపల్లి : హైదరాబాద్‌–నాగార్జునసాగర్‌ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. కారు, బైక్‌ ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన దంపతులతో పాటు వారి కుమారుడు, మరో ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఈ ప్రమాదంలో తల్లిదండ్రితో పాటు సోదరుడిని కోల్పోయిన పదేళ్ల లోపు బాలుడు ఒంటరిగా మిగలగా, ఎదిగిన కుమారులు కుటుంబానికి ఆదెరువు అవుతారనుకుంటే విగత జీవులుగా మారడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. నసర్లపల్లి ప్రమాదానికి మితిమీరిన వేగానికి తోడు మూలమలుపే కారణమని పోలీసులు భావిస్తున్నారు.

అనాథగా పదేళ్ల బాలుడు

దేవరకొండ డివిజన్‌ పరిధిలోని పీఏపల్లి మండలం అక్కంపల్లి గ్రామానికి చెందిన భార్య, భర్తలు మద్దిమడుగు ప్రసాద్‌, మద్దిమడుగు రమణమ్మలకు ఇద్దరు కుమారులు. కాగా వీరి కుటుంబం హైదరాబాద్‌లో ఉంటోంది. ప్రసాద్‌ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమారుడు మద్దిమడుగు అవినాష్‌ దేవరకొండలోని గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతుండగా చిన్న కుమారుడు అఖిల్‌ హైదరాబాద్‌లో 4వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో అవినాష్‌ అనారోగ్యానికి గురి కావడంతో కొన్ని రోజుల క్రితం తమతో పాటు హైదరాబాద్‌కు తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఈకేవైసీ చేయించేందుకు రెండు క్రితమే చిన్న కుమారుడు అఖిల్‌ను స్వగ్రామంలో నాయనమ్మ వద్ద వదిలిపెట్టారు. పెద్ద కుమారుడి ఆరోగ్యం మెరుగుపడడంతో పాఠశాలలో వదిలిపెట్టాలని, అలాగే గ్రామంలో రేషన్‌ షాపులో కేవైసీ చేయించే పని నిమిత్తం బుధవారం మధ్యాహ్నం భార్య, భర్త, పెద్ద కుమారుడితో కలిసి బైక్‌పై బయల్దేరారు.ఈ క్రమంలోనే నసర్లపల్లి సమీపంలోని మూలమలుపు వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబంలో ముగ్గురు మృతి చెందగా చిన్న కుమారుడు అనాథగా మిగిలాడు. నాయనమ్మ నర్సమ్మ బాలుడిని పట్టుకొని రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని గ్రామస్తులు,బంధువులు కోరుతున్నారు.

ఇద్దరు విద్యార్థుల కుటుంబాలదీ దీనగాథే..

చింతపల్లి మండలం కుర్రంపల్లి గ్రామం నలుగురు స్నేహితులది ఒకే గ్రామం. నలుగురు కూడా కొండమల్లేపల్లిలోని ఒకే కళాశాలలో ఇంటర్‌ పూర్తి చేసుకున్నారు. గ్రామానికి చెందిన ఈదయ్యకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడైన పట్నం మణిపాల్‌ ఈ ఘటనలో మృత్యువాతపడ్డాడు. అలాగే గ్రామానికి చెందిన యాదయ్య కుమారుడు వనం మలికార్జున్‌ తండ్రి గతంలోనే మృతిచెందడంతో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. యాదయ్యకు ముగ్గురు కుమారులు కాగా ఈ ఘటనలో మృతిచెందిన వనం మల్లికార్జున్‌ చిన్నకుమారుడు. కుర్రంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తరచూ ఈ మూలమలుపు వద్దే..

హైదరాబాద్‌–నాగార్జునసాగర్‌ రాష్ట్ర రహదారి చింతపల్లి మండలంలో 33 కి.మీ. విస్తరించి ఉండగా తరచూ నసర్లపల్లి మూలమలుపు వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో కూజర్‌ – లారీ ఢీకొన్న ఘటనలో 13మంది మృత్యువాతపడ్డారు. నసర్లపల్లి ఎక్స్‌ రోడ్డు సమీపంలో వంపుతో కూడిన మూలమలుపు వద్ద మూడు కార్లు ఒకదాని వెనుక ఒకటి ఢీకొట్టుకోవడంతో ఏడుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందిన ఘటనలు ఉన్నాయి.






తండ్రీకుమారుడు ప్రసాద్‌, అవినాష్‌ మృతదేహాలు, గాయపడిన రమణమ్మ, పట్నపు మణిపాల్‌, వనం మల్లికార్జున్‌, మనువడు అఖిల్‌తో నాయనమ్మ నర్సమ్మ